క్లుప్తంగా

ఆలయాలకు మంత్రి పెద్దిరెడ్డి విరాళం



మేలుందొడ్డిలో అంబేద్కర్ విగ్రహానికి విరాళం ఇస్తున్న భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్

పుంగనూరు: మండలంలోని పలు ఆలయాలకు శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విరాళం ఇచ్చారు. ఈ మేరకు నగదును ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ ఆలయాల నిర్వాహకులకు అందజేశారు. మేలుందొడ్డి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి రూ.40 వేలు, జౌకొత్తూరులో గంగమ్మ ఆలయానికి రూ.50 వేలు, అలజనేరు గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.50 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ నంజుండప్ప, నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

గుడుపల్లె: మండలంలోని గుడిచెంబగిరి గ్రామానికి చెందిన మునెమ్మ (59) శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని స్థానిక నాయకులను ఆదేశించారు. దీంతో బాబు, మురళి, జయప్ప, సురేష్, వెంకటేశులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందజేశారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం



సిమెంటు రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రామకుప్పం: మండలంలోని కెంచనబల్లలో మసీదుకు వెళ్లేదారి లేక ముస్లింలు ఇబ్బందిపడుతున్నారు. స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యం, మండల కో ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి రోడ్డు సమస్యను ఎమ్మెల్సీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్సీ రూ.2.5 లక్షలు మంజూరు చేశారు. ఈ క్రమంలో శనివారం కెంచనబల్లలో సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించారు. మండల మైనార్టీ ఉపాధ్యక్షుడు సైపుల్లా, చిన్నతంబి, మధు పాల్గొన్నారు.

మసెమ్మ భక్తిశ్రద్ధలతో జాతర



విశేష అలంకరణలో మసెమ్మ

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లెలో శనివారం సాయంత్రం మసెమ్మ జాతరను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పపల్లకిలో ఊరేగించారు. గ్రామంలోని కుంటిగంగమ్మ, ధనకుంట గంగమ్మ, బోయకొండ గంగమ్మ, నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో అమ్మవారికి గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, నాయకులు కొత్తపల్లె చెంగారెడ్డి, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం అమ్మవారిని దర్శించుకోనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



తల్లిదండ్రులతో బాలుడు ఆఫ్నాన్

పలమనేరు: ఆడుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిన బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారు గంటల వ్యవధిలోనే బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన శనివారం పలమనేరులో చోటు చేసుకుంది. పట్టణంలోని ఆర్‌కే వీధిలో నివాసముంటున్న జిలానీ కుమారుడు ఆఫ్నాన్(8) శనివారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చాడు. తర్వాత ఆడుకునేందుకు వెళ్లి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి బాలుడు లక్ష్మీనగర్‌లో ఉన్నట్టు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

చంద్రబాబు చేసింది శూన్యం

- కుప్పం ప్రజలు చంద్రబాబును ఏడుసార్లు నమ్మారు
- ఈ సారి మమ్మల్ని ఆశీర్వదించండి
- జగన్‌తోనే సంక్షేమం సాధ్యం
- విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం: చంద్రబాబునాయుడు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా కుప్పానికి చేసింది శూన్యమని విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. కుప్పంలో శనివారం గాండ్ల కులస్తులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు తన పేరు నిలబడేలా ఒక్క ప్రాజెక్టు అయినా చేపట్టాడా అని ప్రశ్నించారు. అబద్దాల చంద్రబాబును నమ్మొద్దని తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో అబద్ధాలు, మోసపూరిత హామీలతో రాష్ట్ర ప్రజలతో పాటు కుప్పం వారినీ నమ్మించి నట్టేట ముంచారని ఆరోపించారు. చెప్పిన మాటను నిలబెట్టుకోవడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేర్చుకున్న రాజకీయమన్నారు. ఆ తరహాలోనే ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని గుర్తు చేశారు. కుప్పం పర్యటనలో చెప్పిన ప్రకారం హంద్రీనీవా కాలువ పూర్తి చేశామని, పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ పథకాలు అందించామన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో బీసీలు ఎక్కువగా ఉన్నా ఆదరణ లభించక పోవడం దారుణమన్నారు. 450 ఓట్లు ఉన్న ఒక సామాజికవర్గమే 40 ఏళ్లగా కుప్పాన్ని ఏలుతోందన్నారు. పేదల కోసం సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి 120 సార్లు బటన్ నొక్కారని, ఆయన చేపట్టిన ప్రజా సంక్షేమం యధావిధిగా కొనసాగేందుకు ప్రజలు రెండుసార్లు ఈవీఎంలపై బటన్ నొక్కాలని కోరారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ 35 ఏళ్లగా కుప్పం ఎమ్మెల్యేగా పని చేస్తున్న చంద్రబాబునాయుడు గాండ్ల కులస్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. టీడీపీలోనే గాండ్ల కులస్తులు ఉన్నత స్థానాల్లో ఉన్నా చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఎంపీపీలు అశ్విని, వరలక్ష్మి, సుబ్రమణ్యం, జెడ్పీటీసీ కృష్ణమూర్తి, నితిన్, శ్రీనివాసులు, శరవణ, పార్టీ కన్వీనర్లు రామకృష్ణ, బుల్లెట్ దండపాణి, బాబురెడ్డి, మురుగేష్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

మంత్రి పెద్దిరెడ్డికి ఘనస్వాగతం

బైరెడ్డిపల్లి: కుప్పం పర్యటనకు వెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శనివారం బైరెడ్డిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సర్పంచులు బాలక్రిష్ణగౌడు, చంద్రమౌళి, వెంకటేష్, దేవేంద్రరెడ్డి, రాజప్ప, ఎంపీటీసీలు వినాయకం, నాగరాజు, జగదీష్, కేశవులు, మహబూబ్‌ఖాన్, ఖాదర్ బాష, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ

అభివృద్ధే మా అజెండా



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, ప్రజాప్రతినిధులు

- మాటల్లో కాదు చేసి చూపించాం
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే మా పార్టీ ప్రచార అస్త్రాలు
- ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన హామీలకు మించి అభివృద్ధి పనులు చేపట్టారని, అవే తమ పార్టీ అజెండాగా మారాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. అభివృద్ధిని చూసి ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన శనివారం పెద్దబరినేపల్లి పంచాయతీలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఎస్ బండపల్లిలో రూ.15 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డు, ముదరందొడ్డి పంచాయతీ నడిపేపల్లిలో వైఎస్సార్ కాలనీ, రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.30 లక్షలతో నిర్మించిన డీసీసీ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. మసీదు నిర్మాణానికి స్థల పొజిషన్ సర్టిఫికెట్ అందజేశారు. నడమంత్రంలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్లను ప్రారంభించారు. అదే పంచాయతీలోని మద్దిమాకుపల్లిలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ భవనం, ఏడుచుట్ల కోట గ్రామంలో రూ.12 లక్షలతో సీసీ రోడ్లను ప్రారభించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ రాష్ట్రంలో ఒకటే బడ్జెట్ ఉందన్నారు. ఇప్పుడు అమలవుతున్న పథకాలు చంద్రబాబు పాలనలో ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీల పాలన మొదలవుతుందని, ప్రజలు మళ్లీ కష్టాల్లోకి కూరుకుపోతారని జోస్యం చెప్పారు. తాము మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధిని చేశామని వివరించారు. జగనన్న చేస్తున్న మంచిని ప్రజలకు వివరించి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మన్ రెడ్డి, తమీమ్, రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, సింగిల్‌విండో చైర్మన్ గోపిరెడ్డి, సర్పంచ్ దామోదారం, శ్రీనివాసులు, నాయకులు సేట్, రాధాకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, గుడూసాబ్, రఘుపతినాయుడు, బాబురావ్, కుమార్‌రాజా, పూలనాగ, భూపతి, బాబు పాల్గొన్నారు.



ముదరందొడ్డి పంచాయతీలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరులో అభివృద్ధి పనులకు పెద్ద పీట



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను పాలకవర్గం ఆమోదించింది. ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జీజీఎంపీ (హై ఇంపాక్ట్ పనులు-2023-24) నిధుల నుంచి రూ.2.23 కోట్లతో పట్టణంలో పలు బీటీ రోడ్లు, సీసీరోడ్లు నిర్మాణం చేపడతామన్నారు. అలాగే కుక్కల బెడద నుంచి జనం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అనిమల్ కేర్ ల్యాండ్ ద్వారా కుక్కలను పట్టి వాటికి కుని ఆపరేషన్లు చేసి తిరిగి వదిలిపెడతామని చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కాలువపల్లి వైఎస్సార్ జలాశయం, నాగమంగళం పంప్ హౌసల వద్ద ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్ వద్దకు కాలువలు చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. మున్సిపల్ శానిటరీ విభాగానికి అవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తామన్నారు. రాబోవు సాధారణ ఎన్నికలకు ముందస్తుగా రూ.5 లక్షలను ఖర్చు పెట్టడం ఆపై దాన్ని ప్రభుత్వం రాగానే జనరల్ ఫండ్‌లోకి జమ చేస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గుల్జార్, రవి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కే సాథ్



హర్ దిల్‌మే వైఎస్సార్ కరపత్రాలు విడుదల చేస్తున్న ఫక్రుద్దీన్‌షరీఫ్, సాజిదాబేగం, ఇఫ్తికార్

పుంగనూరు: పట్టణంలోని రహమత్‌నగర్‌లో శనివారం రాయలసీమ మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్ ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైఎస్సార్- హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మన హృదయాలలో వైఎస్సార్, మనమంతా జగన్‌వైపే అంటు నినాదాలు చేశారు. ఫకృద్దీన్‌షరీఫ్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. ముస్లింలకు ప్రభుత్వం అందించిన పథకాలు, వారి అభివృద్ధికి అందించిన సహకారాన్ని వివరించి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కెఎస్ఏ.ఇఫ్తికార్‌అలీఅహమ్మద్, కౌన్సిలర్ సాజిదాబేగం, నాయకులు అప్సర్, జావీద్, జాఫర్ జవహర్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై సమీక్ష

రొంపిచెర్ల: మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్ ఆదేశించారు. ఆయన శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియోపై అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 2800 మంది ఉన్నారని తెలిపారు. వారికి పోలియో చుక్కలు వేసేందుకు 21 కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. పిల్లలకు జలుబు, జ్వరం ఉన్నా పోలియో చుక్కలు వేయించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారి, ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీషా, ఎంఎల్‌హెచ్‌పీలు గీతాశ్రీ, భారతి పాల్గొన్నారు.

వైభవం.. కాశీనాథుని బ్రహ్మ రథోత్సవం



రథంపై ఊరేగుతున్న కాశీవిశ్వేశ్వరుడు

పలమనేరు: పట్టణంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బ్రహ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణ వాసులు తేరును లాగేందుకు ఉత్సాహం చూపారు. రథంపై కొలువైన కాశీనాథునికి ప్రతి ఇంటి వద్దా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం యాగశాల నుంచి రథాన్ని ఆలయం వద్దకు తీసుకువచ్చారు. తేరు కనిపించకుండా పరదాలు చుట్టి యాజ్ఞికులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామిని విశేషంగా అలంకరించి రథం కొలువుదీరి ఊరేగింపుగా బయలుదేరారు. గంగమ్మ గుడి వీధి నుంచి జాతీయ రహదారి మీదుగా పాతపేట, తాలూకా కచేరి వీధి, జవిళి వీధి, బజారు వీధి మీదుగా రథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పండరి భజనలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, నాదస్వర వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో రథోత్సవం కోలాహలంగా సాగింది. కర్ణాటకకు చెందిన వీరభద్రుని వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని యువత, చిన్న పిల్లలు, వృద్ధులు తేరును లాగేందుకు ఉత్సాహం చూపారు. మహిళలు ఇళ్ల వద్ద స్వామికి హారతి పట్టి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఎటువంటి ప్రమాదం జరగకుండా ట్రాన్స్‌కో అధికారులు ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరాను ఆపేశారు. మరో వైపు పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. కొత్తపేట చింతకాయల మండీ వద్ద మసీదు నిర్వాహకులు ముజ్జు తదితరులు ఆలయ కమిటీ సభ్యులను సత్కరించారు. తేరు లాగుతున్న వారికి మంచినీటి బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి హిందూ, ముస్లింల ఐక్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కమలాకర్, ఆలయ చైర్మన్ వీరభద్ర, సభ్యులు గోపాల్‌రెడ్డి, హరీష్‌రాయల్, అర్చకులు, పెద్ద సంఖ్యలో పట్టణ వాసులు పాల్గొన్నారు.



వీరభద్ర వేషధారులు

27న భీమేశ్వర స్వామి కల్యాణం

పుంగనూరు: ఈనెల 27న మండలంలోని భీమగానిపల్లెలో వెలసిన జ్ఞానప్రసూనాంబ సమేత భీమేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు గ్రామస్తులు తెలిపారు. అలాగే ఆలయంలో శ్రీవల్లీ దేవసేన, సుబ్రమణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఇందులో మంత్రి పెద్దిరెడ్డి రామంచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో నెలకొల్పారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈవో చంద్రమౌళి, ఉభయదారులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతినెలా పౌర్ణమి రోజున చండీ హోమం చేస్తారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం అధికారులు ఉభయదారులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం



విశేషాలంకరణలో శివపార్వతులు

సదుం: మండలంలోని జంగంపల్లె కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి గ్రామోత్సవం, రథోత్సవం నిర్వహించారు.

బైరెడ్డిపల్లెలో...

బైరెడ్డిపల్లె: కుప్పనపల్లెలో వెలసిన కాళ భైరవేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం కనుల పండువగా చేపట్టారు. భైరవీ, కాళభైరవేశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు, మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం చేపట్టారు. వేద పండితులు మురళీధరరావు, శంకరశర్మ, ఉభయదారులు గాయత్రి, సుభాష్, శారద, క్రిష్ణప్ప, రఘువేగౌడు, భైరప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్ఈవో ఏపీ సుబ్బరాజు

పలమనేరు: చిత్తూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే తమ లక్ష్యమని జిల్లా ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏపీ సుబ్బరాజు తెలిపారు. ఆయన శనివారం రాత్రి పలమనేరు సెబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి డీపీఆర్, నాన్ డీపీఆర్‌పై అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తమిళనాడు, కర్ణాటక పోలీసులతో బోర్డర్ సమావేశాలు నిర్వహించి నిఘాను కట్టుదిట్టం చేశామని తెలిపారు. ఎన్నికల కోసం డబ్బు, లిక్కర్ ఇక్కడికి రాకుండా ఉండేందుకు ఇప్పటికే సరిహద్దులో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట స్థానిక సెబ్ అధికారులు ఉన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



వలంటీర్లతో నాయకులు, అధికారులు

పెద్దపంజాణి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి కొనియాడారు. మండలంలోని రాజుపల్లి సచివాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదల ఇంటి వద్దకే అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. అనంతరం వలంటీర్లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ రెడ్డి, క్రిష్ణప్ప, పీఎస్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోనేటిరాయునికి ఊంజల్ సేవ





వెండి పతకాలను స్వీకరిస్తున్న ఆలయ సిబ్బంది, పతకాలు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా స్వామికి ఊంజల్ సేవ చేశారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని ఊంజల్‌పై కొలువు దీర్చి మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ ఊంజల్ సేవ చేపట్టారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ఆలయ పర్యవేక్షకులు గజేంద్ర, అర్చకులు పాల్గొన్నారు.

కోనేటిరాయస్వామికి వెండి పతకాలు విరాళం

కీలపట్ల కోనేటిరాయస్వామికి మదనపల్లికి చెందిన మురళీక్రిష్ణ రూ.60 వేలు విలువ చేసే వెండి ఆభరణాల పతకాలు విరాళంగా ఇచ్చారు. ఆయనకు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, ప్రధానార్చకులు దేవరాజాచార్యులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా పౌర్ణమి పూజలు

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ అంజనాద్రిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇక్కడి భారీ ఆంజనేయుని విగ్రహానికి అభిషేకం చేశారు. కొండపైనున్న ఆంజనీపుత్రుడు, శ్రీరాముల ఆలయంలోనూ విశేష పూజలు చేశారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు రత్నారెడ్డి, ఈశ్వరయ్య, మొరం మణి పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు దీపాలను వెలిగించారు. ఆలయ నిర్వాహకులు ధ్వజ స్తంభంపై పౌర్ణమి దీపాన్ని వెలిగించారు.



ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

రాజనాలబండలో..

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో వెలసిన ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు స్వామివారికి పూజలు చేసి పాదముద్రలపై నిలబడి ప్రమాణం చేశారు. భక్తులకు ఆలయ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ ఆధర్వంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రథంపై వేణుగోపాలుడి చిద్విలాసం





రథంపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి, రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పట్టణానికి చెందిన పి.రామ్మూర్తి నాయుడు, పి.సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ పిఎం బసప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా రథోత్సవం చేపట్టారు. వేలాది మంది భక్తుల్లు స్వామిని దర్శించుకున్నారు. రథంపై ఉప్పు, అరటి పండ్లు, పూలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. రథాన్ని లాగడానికి భక్తులు ఉత్సాహం చూపారు. రథం ముందు కోలాటాలు, మంగళవాయిద్యాలు అలరించాయి. మహిళలు స్వామి వారికి అడుగడుగునా హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద ఉభయదారులు భక్తులకు అన్నదానం చేశారు. సీఐ లింగప్ప ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి స్వామి వారికి ధూళి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిఎస్ లక్ష్మి, ఉభయదారుల కుటుంబ సభ్యులు హరినాథ్, గోపీనాథ్, రాజా, రమేష్, ధీరజ్ పాల్గొన్నారు.